క్లుప్తంగా

విజయగౌరికి మద్దతుగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాలకొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్ సభ్యులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎఫ్ బలపరిచిన అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా నిలవాలని నినాదాలు చేశారు. యూటీఎఫ్ నాయకులు భాస్కరరావు, పైడిరాజు మాట్లాడుతూ.. చట్టసభల్లో సమస్యలపై ప్రస్తావించే వారికి అండగా నిలబడాలని, మొదటి ప్రాధాన్యత ఓటును విజయగౌరికి వేయాలని కోరారు.

వైభవంగా మెహర్‌బాబా జయంతి



పట్టణంలో మెహర్‌బాబా భక్తుల తిరువీధి

పాలకొండ రూరల్: అవతార్ మెహర్‌బాబా 131వ జయంతి పాలకొండలో వైభవంగా చేపట్టారు. ఈ క్రమంలో బాబా భక్తులు నగర పంచాయతీలో సోమవారం తిరువీధి నిర్వహించారు. అంతకుముందు స్థానిక మందిరంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అలాగే ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాలను బాబా ప్రేమిక బృంద అధ్యక్షుడు ఎ.జనార్ధనరావు, కార్యదర్శి పీవీ రమానంద్, తదితరులు పర్యవేక్షించారు.

చినుకు పడితే చిత్తడే..



సింగిడి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

భామిని: మండు వేసవిలోనూ ప్రయాణికులకు బురద కష్టాలు వీడడం లేదు. ఈ వారంలో రెండుసార్లు వర్షం కురడంతో మండలంలోని పలు రహదారులు చిత్తడిగా మారాయి. ఏబీ రోడ్డు అయితే మరీ దారుణంగా తయారైంది. గోతుల్లో నీరు చేరడంతో రాపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వేసవిలో కూడా తమకు రోడ్డు కష్టాలు వీడడం లేదని వాపోయారు.

సర్పంచ్‌లకే 'ఉపాధి' పనులు ఇవ్వాలి



సర్పంచ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలసరూరల్: ఉపాధి హామీ పథకం పనులనూ అధికార కూటమి తన పార్టీ కార్యకర్తలు, నాయకులకే ఇవ్వడం సరికాదని, ఇది కేవలం అధికార దుర్వినియోగమే అవుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. కురుపాం మండలంలోని చినమేరంగిలోని తన క్యాంపు కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం మండలాల సర్పంచ్‌లతో సోమవారం సమావేశమైన ఆమె.. ఉపాధి హామీ పథకం పనుల్లో ఏ ఒక్క పని అయినా సర్పంచ్‌ల తీర్మానం మేరకే జరగాలన్నారు. అలా కాకుండా వెండర్ విధానం అవలంబిస్తే సర్పంచ్‌ల హక్కులు కాలరాసినట్లేనన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ప్రహరీ, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు సర్పంచ్‌లకే ఇవ్వాలన్నారు. ఈ విషయమై కోర్టు కూడా తీర్పు ఇచ్చిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. కోర్టు తీర్పు అమలు చేయకపోతే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనన్నారు.

బారికేడ్ల అందజేత



బారికేడ్లు అందజేసిన క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ప్రతినిధులను అభినందిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ప్రతినిధులు స్థానిక పోలీసులకు ఐదు బారికేడ్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కె. ప్రయోగమూర్తి మాట్లాడుతూ.. ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతగా పోలీస్ శాఖకు సహకరించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, రమేష్‌బాబు, చక్రధరరావు, కె. సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండే కాలం



ఆదివారం మధ్యాహ్నం ఎండకు నిర్మానుష్యమైన సీతంపేట మెయిన్‌రోడ్డు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండల బారిన పడితే వడదెబ్బ, చర్మవ్యాధులకు గురయ్యే ఆస్కారం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

సీతంపేట: ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రోజువారీ నమోదయ్యే ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 35 నుచి 38 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఈ సంవత్సరం ఉండవచ్చని వాతావరణ నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రాణాప్రాయం లేకుండా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా ఎండల్లో తిరిగితే సన్‌స్ట్రోక్ (వడదెబ్బ), హీట్ సింకోప్ (తలతిరగడం), హీట్ ఎక్సాషన్(అలసట) హీట్ క్రాంప్స్ (కండరాలు, పిక్కలు లాగడం)తో పాటు చర్మవ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బ ప్రమాదకరం..

ప్రజలు వేసవిలో ఎక్కువగా వడదెబ్బ బారిన పడతారు. ఇది చాలా ప్రమాదకరం. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. ఎండలో ఎక్కువసేపు తిరిగి తగినంత లవణాలున్న నీరు తీసుకోకోపోతే అపస్మారక స్థితికి చేరుతారు. తీవ్ర జ్వరం, మూత్రం రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బకు గురైనట్లు తొలుత గుర్తించాలి. కొందరిలో ఫిట్స్ లక్షణాలు కూడా కనిపిస్తుండడం గమనార్హం. పార్కిన్‌సన్ (తలఊపడం) వ్యాధికి సంబంధించి మందులు వాడే వారు త్వరగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. బయట ఆహారం తీసుకోవడం ద్వారా డయేరియా సోకే ప్రమాదం ఉంది. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం వల్ల కిడ్నీలపై కూడా ప్రభావం పడుతుంది. శరీరమంతా యాసిడ్ ఏర్పడి అవయువాలపై ప్రభావం చూపుతాయి. అధికవేడిమితో చెమట కాయలు రావడం, గడ్డలు కట్టడం, సన్‌బర్న్ (చర్మం కమిలిపోవడం) వంటి సమస్యలు వస్తాయి. శరీరంపై దద్దుర్లు సైతం ఏర్పడతాయి.



ఎండకు గొడుగువేసుకుంటూ నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు, చిన్నారులు

నాలుగు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలిలా...

తేదీ	పగటి ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)
20.02.25	34
21.02.25	36
22.02.25	35
23.02.25	38

అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో అప్రమత్తంగా ఉండాలి. ఎండల్లో తిరగకూడదు. ఎండలోకి వెళ్లినపుడు తప్పనిసరిగా గొడుగు వేసుకోవాలి. వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలి. మజ్జిగ, కొబ్బరినీళ్లు వంటివి తీసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించడం చాలా మంచిది.

బి.శ్రీనివాసరావు, సూపరింటిండెంట్, ఏరియా ఆస్పత్రి

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి..

ఎండ కారణంగా స్పృహ కోల్పోయి పడిపోయిన వ్యక్తులకు చల్లటిగాలి తగిలేలా ఫ్యాన్ లేక కూలర్ ముందు సేదతీరేలా చేయాలి. తడిగుడ్డతో శరీరం తుడవాలి. తర్వాత దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడంతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. దీని ద్వారా మనిషి ప్రాణాపాయస్థితి నుంచి గట్టెక్కుతాడు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- సాధ్యమైనంత వరకు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగరాదు.
- ఎటువంటి కార్యక్రమాలైనా ఎండ తక్కువగా ఉన్న సమయాల్లో చేసుకోవాలి. కాటన్, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి
- జీన్స్-బ్లాక్ షర్టులు వేసుకోకపోవడం మంచిది
- బయటకు వెళ్లేటప్పుడు టోపీ, గొడుగును వెంట తీసుకువెళ్లాలి
- శరీరానికి ఎండతగలకుండా దుస్తులు ధరించాలి
- సన్‌స్క్రీన్ లోషన్‌లు వాడడం మంచిది
- తరచూ నీరు, లవణాలు తీసుకోవాలి
- నీటితో పాటు కొబ్బరిబొండాలు, కాయగూరలు, పండ్లు తీసుకోవాలి
- కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి
- రహదారుల పక్కన విక్రయించే వేపుడు పదార్థాలకు దూరంగా ఉండాలి

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించండి



నిరసన తెలుపుతున్న ఏపీ గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్ డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక గిరిజన కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అక్కడి నుంచి ర్యాలీగా జీసీఎంఎస్ కార్యాలయం వరకు వెళ్లారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతాల నుంచి గిరిజనులు సేకరించి తెచ్చిన, పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర లేకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఏటా గిరిజనులు సేకరిస్తున్న చింతపండును మాత్రం నామమాత్రపు ధరకు కొనుగోలు చేస్తున్న జీసీసీ.. పసుపు, కొండచీపుళ్లను మాత్రం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. అన్నిరకాల అటవీ ఉత్పత్తులను జీసీసీ ద్వారానే కొనుగోలు చేయాలని, చింతపండు కిలో రూ.60, కొండచీపుళ్లు కిలో రూ.80, పసుపు కిలో రూ.200కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీసీసీ సూపరింటెండెంట్ సాంబశివరావును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు బి.అడిత్తో పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: పీఎం జన్‌మన్ గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గృహనిర్మాణాల లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా బైక్ ర్యాలీ



కొమరాడ: ప్రచారం చేస్తున్న సీపీఎం, పీడీఎఫ్ నాయకులు

కొమరాడ: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం, గిరిజన ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పీడీఎఫ్ నాయకులు, సీపీఎం నాయకులు సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. మొదటి ప్రాధాన్యతా ఓటు పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి కోరారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కె.విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్, సీపీఎం నాయకులు కురుపాం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలి ప్రాధాన్యతా ఓటు ఆమెకే వేసి, గెలిపించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పక్కాగా మెనూ..



మెనూ పకడ్బందీగా అమలు చేయాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర అన్నారు. మండలంలోని దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలన్నారు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

– సీతంపేట

సమయపాలన పాటించండి

గరుగుబిల్లి: సమయపాలన పాటించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని సంతోషపురం గ్రామ సచివాలయాన్ని ఆమె సోమవారం సందర్శించి, సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు అవసరమైన పౌరసేవలు సక్రమంగా అందించాలని, సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలని తెలిపారు. రైతుల భూ ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

పీవోఎల్ఆర్‌ను పూర్తి చేయండి

జియ్యమ్మవలస: పీవోఎల్ఆర్(ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్)ను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దారు ఆర్.పకీరు ఆదేశించారు. ఇదే విషయమై ఆయన వీఆర్‌వోలందరికీ సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలో ఎంపిక చేసిన రాజయ్యపేటలో రీసర్వే పూర్తి చేస్తామన్నారు. ఇప్పుడు ఎం.అల్లువాడ, గెడ్డతిరువాడ గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసిందని మార్చి 1వ తేదీ నుంచి ఆయా ప్రాంతాల్లో రీసర్వే జరగనుందన్నారు. రీసర్వేను దృష్టిలో ఉంచుకుని, పాత రికార్డులను వీఆర్‌వో లాగిన్ నుంచి తహసీల్దారు లాగిన్ వరకు అన్నీ సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

మక్కువ: స్థానిక బీసీ కాలనీలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా 2వేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు. కాలనీవాసులు నిర్వహించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

పార్వతీపురంటౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సమమితి అధ్యక్షుడు ఈవీ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ యామాన్యం 8 రాష్ట్రాలలోని 31 లక్షల మంది నుంచి పలు స్కీమ్‌ల పేరుతో రూ. 6.380 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించిందని, కంపెనీ ఆర్థిక నేరాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనా సమయంలో వారి పరిశీలనలోకి వచ్చిన అంశాలేనన్నారు. సమర్ధ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణను అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక కల్యాణోత్సవం

బలిజిపేట: మండలంలోని గలావల్లి ఉమాసహిత కామలింగేశ్వర దేవాలయంలో శివపార్వతుల వార్షిక కల్యాణ మహోత్సవాన్ని మామిడి వంశస్థులు, ధర్మకర్తలు, గ్రామ పెద్దల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాఘమాసం బహుళ ఏకాదశినాడు ఆలయ వార్షికోత్సవ కల్యాణం గత 11సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

మేట్‌ల ఎంపికలో రాజకీయం తగదు

● వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉపాధి వేతనదారుల సమస్యలు వివరిస్తున్న బాలేరు ప్రజాప్రతినిధులు

భామిని: ఉపాధి హామీ పథకానికి సంబంధించి మేట్ల నియామకంలో టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని బాలేరు ఎంపీటీసీ సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి, సర్పంచ్ జామి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేడిబోయిన చలపతి ఆరోపించారు. బాలేరులో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి ఉపాధి అధికారులు మేట్‌లను నియమిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి మూడు,నాలుగు కిలోమీటర్ల దూరంలో పనులు కల్పించడంపై వేతనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోనే పనులు కల్పించడంతో పాటు మేట్‌ల ఎంపికలో రాజకీయం చేయకూడదని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేసి, వారిని న్యాయం చేయాలని ఏపీ సీఆర్ఎంటీ హక్కుల సాధన సమితి కన్వీనర్ ఎన్.కాంతారావు, అధ్యక్షుడు ఎ.పోలినాయుడు, జనరల్ సెక్రటరీ పి.వెంకటరావు ఓ ప్రకటనలో సోమవారం కోరారు. సమగ్ర శిక్షలో కేజీబీవీ ఉద్యోగులతో పాటు మరో 12 విభాగాలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, అయితే 6 జనవరి 2025న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 2లో ప్రాజెక్టులో పనిచేస్తున్న వారు(సమగ్ర శిక్ష ఉద్యోగులు) ఎంటీఎస్‌కు అర్హులు కారని పేర్కొనడం తీవ్ర అన్యాయమన్నారు. 2023 డిసెంబర్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు 21 రోజులు చేసిన సమ్మె సమయంలో అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్ ఇస్తామని హామీ ఇస్తూ ఎస్‌పీడీకు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు.

గత ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్ ఇస్తామంటే.. ఈ ప్రభుత్వమేమో ఇవ్వమని చెప్పుండడం సరికాదన్నారు. అలాగే క్లస్టర్లు కుదించడం కారణంగా స్థానికంగా పనిచేస్తున్న సీఆర్ఎంటీలను పక్క మండలాలకు కేటాయించారని, అసలే చాలీచాలనీ జీతాలతో నెట్టుకొస్తున్న సీఆర్ఎంటీలకు అదనపు భారం కలిగిందన్నారు. కావున సీఆర్ఎంటీలకు రవాణా చార్జీలు కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

జియ్యమ్మలసరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కురుపాం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గుమ్మలక్ష్మీపురానికి చెందిన బోటు లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా కొమరాడ మండలం, గుణానపురానికి చెందిన చీమల వరప్రసాద్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు చినమేరంగిలో మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఈ పార్టీ పదవులు కట్టబెట్టిన జగనన్నకు కృతజ్ఞులై ఉంటామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, రానున్న రోజులన్నీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె వారిని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దీనమయ్య, సర్పంచ్‌లు బి.గౌరి, శంకర్, కళావతి, పార్టీ నాయకులు వహీద్‌ఖాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈవో వెంకటరమణ

గుమ్మలక్ష్మీపురం/గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పీసా చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంకటరమణ అన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల పరిషత్ కార్యాలయాల వద్ద పీసా చట్టంపై శిక్షణా తరగతులను ఆయన సోమవారం పరిశీలించారు. పీసా చట్టంపై పూర్తి అవగాహన కలిగి, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు ఎస్.సాల్మన్‌రాజు, జె.ఉమామహేశ్వరి, కురుపాం ఎంపీపీ ఎస్.పద్మావతి, జెడ్పీటీసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

జియ్యమ్మవలసరూరల్: మండలంలోని అల్లువాడ గ్రామ సమీపంలోని దండాసి మెరక గోర్జిని కొంతమంది కబ్జా చేశారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు ఆర్.పకీరును సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు.. సర్వేయరును మంగళవారం ఆక్రమిత ప్రదేశానికి పంపించి, విచారణ చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని, ఆ దిశగా రెవెన్యూ సిబ్బంది కూడా పనిచేయాలని సూచించారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ గోవిందరావు

కొమరాడ: మండల పరిధిలోని దేవునిగుంప వద్ద ఉన్న గుంపేశ్వరుని ఆలయం దగ్గర మహాశివరాత్రి ఉత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీన శివరాత్రి అని, రెండు రోజుల పాటు యాత్ర జరుగుతుందని ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పార్వతీపురం రూరల్ సీఐ ఎస్.గోవిందరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో దైవ దర్శనం జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఎస్ఐ నీలకంఠం పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పాలకొండ రూరల్: మహ శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పి. వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం మీదుగా రామతీర్థం పుణ్యక్షేత్రానికి ఈ నెల 26న 20 బస్సులు.. రాజాం మీదుగా త్రివేణి సంఘం ప్రాంతానికి ఒక బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయనిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యాసంవత్సరానికి గాను ఐదులో 80.. ప్రథమ ఇంటర్‌లో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు గురుకులంలో సంప్రదించాలన్నారు.

● సొలికిరిలో నేత్ర వైద్యశిబిరం



భామిని మండల కేంద్రంలోని సొలికిరి సత్యనారాయణ మందిరంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 64 మందిని పరీక్షించగా.. 34 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, పార్వతీపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ టి.శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కె.చంద్రశేఖర్, కె.ఆంజనేయులు, మత్స్యకార సంఘ అధ్యక్షుడు బర్ల ఆనందరావు పాల్గొన్నారు. – భామిని